# షాక్ ట్రీట్‌మెంట్



"ఈ సారైనా నువ్వు తీసిన ఫోటో అచ్చిరావాలయ్యా" అన్నారు రఘునాథరావు గారు. "తప్పకుండానండి" అన్నాను ఇంకేమనాలో తెలియక. వారమ్మాయి సుభద్ర కెమెరా నెదుర్కోవడానికి తయారవుతోంది. గత రెండున్నరేళ్లగా ఇదే ప్రహసనం. ఆమెకు పెళ్లి సంబంధాల కోసం రకరకాల ఫోటోలు తీయడం, పెళ్లికొడుకులకు పంపడం. చివరికి సంబంధం కుదరకపోవడం.

"కితం సారిది బాగా రాలేదయ్యా, ఈసారి పంజాబీ డ్రెస్‌లో తీయిద్దాం" అనో, "అమెరికా సంబంధం కదా, మోడర్న్‌గా తీయి" అనో, "సైడుపోజులో తీస్తే ఎలా ఉంటుందంటావ్?" అనో, "క్రితం సారి జ్వరం పడి నీరసంగా కనబడిందయ్యా, ఇప్పుడు చూడు, కళకళలాడుతోంది. ఇలా ఉన్నప్పుడే నాలుగు ఫోటోలు తీయించి పెట్టుకుంటే మంచిది కదూ..." ఇలా ప్రతీ రెండు, మూడు నెలలకీ ఒక ఫోటో చొప్పున దగ్గరుండి తీయించారు.

కానీ రెండేళ్లయినా ఏ సంబంధమూ కుదరలేదు. సుభద్ర అనాకారేమీ కాదు, నేను మరీ అంత

నాసిరకం ఫోటోగ్రాఫర్నా కాదు. ఓ మాదిరిగా ఉన్నవాళ్లను కూడా అందంగా తీయగలను. అలాటిది కనుముక్కుతీరు చక్కగా ఉండి, చక్కటి అవయవసౌష్టవం ఉన్న సుభద్రను బాగా తీయలేకపోవడమేం? తీశాను. అయినా ఇప్పటిదాకా ఎవరికీ నచ్చలేదంటే ఆశ్చర్యంగానే ఉంది. ఓసారి ధైర్యం చేసి ఆమె దగ్గరే అనేసాను – "నా ఫోటోగ్రఫీలో లోపం లేదు గానీ, మా ఫోటో స్టూడియో మీకు అచ్చిరాలేదేమోనండి. లేకపోతే ఈ పాటికి మీకు పెళ్లయిపోయుండాలి."

సుభద్ర కళ్లెత్తి ఒక్కసారి చూసి, "అదేం గాదు గానీ, నాన్నగారు అన్నీ పెద్ద యెత్తు సంబంధాలు చూస్తున్నారు. వద్దంటే వినరు. పేపర్లో కనబడ్డవాటి కన్నిటికీ ఉత్తరాలు రాయడం. ఫోటోలు అయిపోవడం, నేను ఇక్కడ మళ్లీ సిద్ధం" అంది నవ్వు తెచ్చుకుని.

నేను సిగ్గుపడ్డాను. సమాధానంగా ఏదో గొణిగాను కానీ నాకే అర్థం కాలేదు ఏమన్నానో. ఆమె అంటే నాకెంతో ఇష్టం. ఆమెకు బాధ కలిగించినందుకు నా మీద నాకే కోసం వచ్చింది కూడా. ఆమెకు కూడా నేనంటే విముఖత లేదనుకుంటా. వాళ్ల నాన్నగారు బయట వెయిట్ చేస్తూంటే స్టూడియోలో సరదాగా మాట్లాడుతుంది. మళ్లీ వాళ్ల నాన్నగారి ఎదుట మాత్రం గప్‌చిప్.

ఒకసారి "మీకు కాబోయే భార్య అదృష్టవంతురాలండి. ఆమె అందాన్నంతా ఎప్పటికీ చెరిగిపోని విధంగా మీరు ఫోటోల్లో బంధించేస్తారు." అంది. నేను లైట్లు సర్దడం ఆపేసి, "ఆమె అందంగా ఉంటుందన్న గారంటీ ఏమిటి?" అన్నాను. "ఏం? మీకు సరితూగే వాళ్లను చేసుకోరా? డబ్బు కోసం ఎలా ఉన్నా చేసేసుకుంటారా?" అంది ఛట్టున.

ఇలా మాట్లాడినంత మాత్రాన ఆమె నేనంటే పడి ఛస్తోందని, పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడుతోందనీ అనుకునేటంత మూర్ఖుడిని కాను. స్టూడియో పెట్టి నాలుగేళ్లవుతున్నా, పనివాణ్ని కూడా పెట్టుకోలేని అర్భకుడిని. రఘునాథరావు గారు ఇప్పటికే అప్పర్ మిడిల్ క్లాసు. దానికి తోడు ఎలాగోలా, తలతాకట్టు పెట్టైనా సరే, కూతురుని పెద్దింట్లో ఇద్దామని చూస్తున్నారు. అలాటప్పుడు ఈమె తెగించి నన్ను పెళ్లాడుతుందా? కలలో మాట.

క్రమక్రమంగా రఘునాథరావు గార్కి కూడా కూతురి పెళ్లి సంబంధాలంటే విసుగు పుట్టినట్టుంది. తోడు రావడం మానేసారు. సుభద్రే అప్పుడప్పుడు వచ్చి ఫోటోలు తీయించుకొని వెళ్తోంది. అప్పుడు మాత్రం బలే సరదాగా మాట్లాడుతుంది. "ఈ ఏంగిల్లో తీయించుకుంటే ఎలా ఉంటుంది? ఇలా ఓ పక్కకు ఒరిగితే ఎక్సైటింగ్‌గా ఉంటుందా?" అంటూ చాలా ఫ్రీగా మాట్లాడుతుంది. నా దగ్గర బిడియం లేకుండా, ఫ్రెండ్లీగా మాట్లాడుతోంది కదాని నేనేదైనా చొరవ చూపిస్తే కొంపలంటుకుంటాయి. సుభద్ర దృష్టిలో నేను పతనమవడమొకటే కాదు, ఆమె నలుగురితో చెప్పిందంటే నా స్టూడియోకు ఎవరూ రావడం మానేస్తారు. 'ఫోటో ఏంగిల్ సరిచూసే మిషతో అక్కడా, ఇక్కడా చేతులేస్తాడట' అంటూ ఊరూ, వాడా చెప్పుకుంటారు. వ్యాపారమూ పోతుంది, ఇన్నాళ్లూ తెచ్చుకున్న మంచిపేరూ పోతుంది.

అవేళ సుభద్ర ఒంటరిగా వచ్చి ఫోటో తీయమంటూ ఇచ్చిన పోజులు చూసి తెల్లబోయాను. "పెళ్లి సంబంధానికేనా!" అని అడిగితే కాదంది. సినిమాలో వేషానికట. "పెళ్లి అయ్యే రాత ఎలాగూ లేదు. 'కొత్త నటీమణులు కావలెను' అన్న ప్రకటన చూశా. అప్లయి చేస్తున్నాను. మా నాన్నతో చెప్పకండి" అంది. నాకు చాలా బాధ వేసింది. సినిమాలంటే ముందునుండీ ఇష్టం ఉంటే అది వేరే సంగతి. పెళ్లి కాలేదని...ఛ, 'నీ కిష్టమయితే నేను పెళ్లి చేసుకోడానికి రెడీ' అని అనగలిగితే ఎంత బాగుంటుంది! కానీ నాకా తాహతేదీ? అసలు సుభద్రకు నామీద ఉన్న అభిప్రాయం ఎలాటిదో?

తన ఇష్టప్రకారమే, కాస్త సెక్సీడ్రెస్‌లో రెచ్చగొట్టే పోజులో ఫోటో తీస్తూండగా జరిగిందా సంఘటన. సుభద్ర "ఈ లైటు ఇలా తిప్పితే వంపులు బాగా కనబడతాయేమో" అంటూ లైటు తిప్పబోయి స్విచ్‌బోర్డ్ మీద చెయ్యేయడంతో షాక్ కొట్టింది. నేను అప్పుడు ముందు గదిలో ఉన్నాను. "ఈ పోజుల్లో ఫోటో తీయడానికి చాలా టైము పట్టేటట్టుంది. మీకు అభ్యంతరం లేకపోతే మెయిన్ డోర్ వేసి వస్తాను. మొన్న ఇలాగే లోపల ఫోటో తీస్తూండగా ఎవడో వచ్చి ఫిలిం రోల్స్ ఎత్తుకుపోయాడు" అని

చెప్పి తలుపు గడియ వేస్తున్నాను ఆ టైములో.

"అమ్మో, షాక్ కొట్టింది" అంటూ సుభద్ర పెట్టిన కేక విని పరిగెట్టుకు వచ్చాను. సుభద్ర కింద పడిపోయి వుంది. కళ్లు మూతలు పడి వున్నాయి. అసలే అర్ధనగ్నపు డ్రస్సేమో, పడిపోవడంలో మరింత చెదిరిపోయి రెచ్చగొట్టేట్టుంది. నన్ను నేను తిట్టుకుంటూ కళ్లు తిప్పుకున్నాను.

ఎలక్ట్రిక్ షాక్ కొట్టినవారికి ఫస్ట్ ఎయిడ్ ఏం చేయాలో గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించాను. అరచేతులు రుద్దాలేమో... రుద్దాను. కదలిక లేదు. అరిపాదాలు?... అవీ రుద్దాను. పాలరాయితో చేసినట్టున్న పిక్కలు కనబడి ముందు నాకు మతిపోయేట్టుంది. ఆపేసాను. అదేదో సినిమాలో లాగ బట్టలిప్పి కౌగలించుకొని పడుక్కోవాలా? ఛ, స్కేటింగు చేస్తూ పడిపోతే అలా చేయాలి. షాక్‌కు కాదు. మరి? బయటకు వెళ్లి ఎవర్నైనా అడిగితే? వద్దు, ఈమెనిలా చూస్తే అపార్థం చేసుకునే ప్రమాదం ఉంది.

మరి ఈమెలో చైతన్యం తీసుకురావడం ఎలా? మూర్ఛపడివుంది. ఏదో సాల్ట్ వాసన చూపించాలి కాబోలు! 'ప్రథమ చికిత్స చేయడం ఎలా?' అనే పోస్టర్లు చూసాను కానీ అవి చదివి, గుర్తు పెట్టుకోకపోవడం చాలా తప్పు. ఇప్పుడు, ఇలా అవసరం వచ్చిపడినప్పుడు... బుర్ర గోక్కుంటే ఎలా? ఆమెకేసి చూస్తూంటే నాకు తట్టింది - అర్టిఫిషియల్ రెస్పిరేషన్ చేయాలని. లేతగా, నిగనిగలాడుతున్న ఆమె పెదాలు 'అవును, అదే చికిత్స' అన్నాయి.

ఆమె పెదాలపై నా పెదాలు ఆన్చి గట్టిగా ఊపిరి పీలుస్తూంటే ఐదు నిమిషాలకు తట్టింది - ఇది ఈత కొడుతూ మునిగిపోయినవారి కిచ్చే ఫస్ట్ ఎయిడ్ కానీ ఎలక్ట్రిక్ షాక్ కొట్టినవారికి కాదని. గబుక్కున లేవబోయేను, కానీ లేవలేకపోయేను... సుభద్ర గట్టిగా అదుముకోవడంతో. "ఇలా చేయాల్సింది..." అంటూ నేను అనబోతూండగానే, "నేనూ మునిగిపోయేను, నీ ప్రేమసాగరంలో.." అంటూ మళ్లీ పెదాలు అందించబోయింది సుభద్ర. "మరి షాకో?" అన్నాను అసలేం జరిగిందో అర్థం చేసుకునే ప్రయత్నంలో. "షాక్ ట్రీట్‌మెంట్ నీలాటి మొద్దబ్బాయిలకు, నాలాటి వాళ్లకు కాదు. రేపే మా నాన్నతో ధైర్యంగా పెళ్లి సంగతి మాట్లాడేయ్." అందామె నన్ను కౌగలింతలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ.

●

(ఆంధ్రప్రభ వీక్లీ జూన్ 1998)